
# మనస్తత్వం

కిల్లన మోహన్ బాబు



"ట్రిక్ ... టక్ ... టక్."

తలుపు చప్పుడయింది. 'తేజ' నవల చదువు తున్న నేను తుళ్ళిపడి లేచాను. విసుగ్గా షర్టు వేసుకుని వెళ్ళి తలుపు తీశాను. ఎదురుగా ఒక ఆకారి నిత వ్యక్తి నిలుచున్నాడు.

"నమస్కారమండీ" అన్నాడు మొహమాటంగా. పట్టుపంచె, సిల్కులాల్చీ, గోల్డ్ ఫ్రేం కళ్ళద్దాలు, చేతికి నాలుగు ఉంగరాలు, గారపళ్ళు— ఇదీ అతని అవతారం! చూడడానికి ఖరీదైన కాంట్రాక్టరులా కన్పిస్తున్నాడు.

"నమస్కారం. లోపలికి రండి" అంటూ లోనికి ఆహ్వానించాను.

నా వెనకే ఇబ్బందిగా వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

"ఇప్పుడు మీరు ఫ్రీగానే ఉన్నారు కదా" ప్రాధేయపడుతున్నట్టుగా అడిగాడు.

"చెప్పండి. ఇప్పుడు నాకేం పనిలేదు. ఫ్రీగానే ఉన్నాను" అన్నాను సిగిరెట్టు ముట్టించి.

"నన్ను మీరు ఎరగరు. నా పేరు అహోబలరావు. నేను రాజమండ్రిలో కాంట్రాక్టులు చేస్తూ ఉంటాను. మీరు రాజమండ్రిలో లెక్చరరుగా పని చేసినప్పుడు మిమ్మల్ని నేను ఎరుగుదును. నా అబ్బాయి 'నాగరాజు' మీ గురించి చెప్తూ ఉండే వాడు. కాని నన్ను మీరు ఎప్పుడూ చూడలేదు" అన్నాడు.

తుళ్ళిపడ్డాను నేను నాగరాజు పేరు వినేసరికి.

"మీరు నాగరాజు తండ్రా?" అన్నాను ఆశ్చ ర్యంగా!

"అవును సార్!"

"వాట్ కెన్ఐ డూ ఫర్ యూ?"

"మరేమీ లేదు సార్. మీరు ఆ కాలేజీ వదిలి వెళ్ళిన తరవాత మా అబ్బాయిలో చాలా మార్పు వచ్చిందండి. మొన్న మెడికల్ 'ఎంట్రన్స్'లో కూడా పాసయ్యాడు. రేపే ఇక్కడ జాయినవడానికి ఆఖరి రోజు. కాని ఇక్కడ మీరు లెక్చరరుగా ఉన్నారని తెలిసి జాయినవడానికి జంకుతున్నాడు. అంచేత మీరు ... అవునంటే ..."

"మీరంటున్న దేమిటో నాకర్థం కావటంలేదు. మీ అబ్బాయి మెడిసిన్‌లో జాయినవడానికి నేను అవునవడానికీ సంబంధం నాకు కనిపించడం లేదు." విసుగ్గా అన్నాను.

"మీరు అలా అంటే నేనేమీ మాట్లాడలేను. మీరు రిజైన్‌చేసి వెళ్ళి పోయిన తర్వాత మా అబ్బాయి చాలా 'సెన్సిటివ్'గా తయారయ్యాడు. ఆ పాత కథంతా గుర్తు తెచ్చుకుని ఇప్పటికీ బాధ పడుతుంటాడు. మీ రాజీనామాకు తనే కారణమని కుమిలిపోతుంటాడు కాని, ఇప్పుడు మీరు మెడికల్ కాలేజీలో ఉన్నారని తెలిసిన తరవాత ఈ సీటు వదలుకోడానికే సిద్ధపడుతున్నాడు కాని మీ ఎదుట పడలేక పోతున్నాడు. మీ రేమయినా తరవాత అతడికి హాని చేస్తారేమోనని అతడి భయం." బెదురుగా అన్నాడతను ఆఖరి వాక్యం వత్తిపలుకుతూ.

"వాట్ నాన్సెన్స్ యూ స్పీక్! మీ అబ్బాయికి నేను హాని చెయ్యడమేమిటి? ఆ సంఘటన నేను అప్పుడే మరిచిపోయాను. నేను అప్పుడు రిజైన్ చెయ్యడానికి గల కారణం ఒక్క మీ అబ్బాయికాదు— ప్రిన్సిపాల్ అసమర్థత, అక్కడి కొందరి లెక్చరర్ల ప్రవర్తన లాంటివి మరెన్నో కారణాలున్నాయి. అదీ కాక— ఆ తరవాత నేను మరో డిగ్రీ సంపాదించడమే కాకుండా, అంతకంటే ఎక్కువ జీతమున్న పోస్టు లోనే ఉన్నాను. అందుచేత అలాంటి భయాలేమీ పెట్టుకోక నాగరాజుని నిరభ్యంతరంగా రేపు కాలేజీలో జాయినవమని చెప్పండి. నా వలన ఎలాంటి హాని జరగదు సరికదా, వీలయితే సహాయమే జరుగుతుంది" అన్నాను ఆవేశంగా.

"మీ రలా అంటారని నాకు తెలుసు. అయినా మీ నోటి ద్వారా వింటె కొంత సంతృప్తి. అప్పుడు మా అబ్బాయి ప్రవర్తనకు అతని తండ్రిగా నేను సిగ్గుపడుతున్నాను. మిమ్మల్ని క్షమించమని కోరు తున్నాను" అన్నాడతను చేతులుపట్టుకుంటూ.

"అహోబలరావుగారూ! ఏమిటిది? మీరు పెద్ద వారు. అనవసరంగా మీ అబ్బాయి గురించి ఆందో ళన చెందకండి. రేపే అతన్ని జాయిన్ చెయ్యండి. ఈ సీటుకోసం వేలకు వేలు 'డొనేషన్స్' కడు తుంటారు. అలాంటిది లేనిపోని అనుమానాలతో సీటు వృథా చేసుకోకండి."

"మీ మాటలు నాకు కొండంత బలాన్నిచ్చాయి. ఇహ వస్తాను."

"మంచిది. ఉంటాను" అని అతన్ని గుమ్మం వరకూ సాగనంపి, తలుపేసి లోపలికొచ్చి మంచం మీద వాలాను. నాకు తెలియకుండనే నా మనసు రెండేళ్ళ క్రితం నా రాజమండ్రి జీవితం వైపు మళ్ళింది.

అవి నేను కొత్తగా రాజమండ్రి కాలేజీలో లెక్చరరుగా జాయినయిన రోజులు... ఉపాధ్యాయ జీవితం మొదట్లో చాలా నిరాశా జనకంగా గడిచింది. ఏ క్లాసుకు వెళ్ళినా విద్యార్థుల ఈలలు, చప్పట్లు, పిల్లికూతలూ, అరుపులూను! ఎంతో ఉత్సాహంగా

చెప్పాలని ఉవ్విళ్ళూరే నాకు మొదట్లోనే నిరాశ ఎదురయింది. అసలు వీళ్ళు ఎందుకు అల్లరిచేస్తారో, అందులో వీళ్ళు పొందే ఆనందం ఏమిటో నా కర్థ మయ్యేది కాదు. ఇదే మాట 'స్టాపు రూమ్' లో అనేవాణ్ణి. కొందరు లెక్చరర్లు 'నేనేదో అసమర్థుణ్ణి' అన్నట్టు చూసేవారు. ఆ చూపులు నేను భరించలేక పోయేవాణ్ణి. వాళ్ళ క్లాసుల్లో మైన్సు విద్యార్థులు సైలెంటుగా ఉన్న మాట నిజమే. కాని అది వీళ్ళ చేతిలో ఉన్న ఆ ప్రాక్టికల్ మార్కులకోసం కానీ, వీళ్ళమీద భక్తితో కాదని నాకు తెలుసు. అయినా వీళ్ళు మాత్రం అదేదో వీళ్ళ గొప్పతనమనీ, సమర్థతనీ ఫీలవుతూండేవారు. ఎన్నోసార్లు వాళ్ళతో వాగ్యు ద్ధాలు జరుగుతుండేవి!

ఒక రోజు ఉదయమే ఫస్టు పీరియడ్‌లో నాకు బయాలజీ గ్రూప్ క్లాసు ఉంది. అందులో సాధార ణంగా అమ్మాయిలెక్కువగానే ఉంటారు. నేను మామూలుగా క్లాసుకి వెళ్ళి అటెండెన్స్ వేసి పుస్తకం తీసేను. ఇంతలో లేటుగా వచ్చిన ఒక అమ్మాయి తలుపు దగ్గర నిల్చుని "మే ఐ కమిన్ సర్" అంది.

"యస్" అన్నా నేను.

ఆమె ఆలస్యంగా వచ్చానన్న బాధతో పరుగులాంటి నడకతో లోపలి కొస్తోంది. ఇంతలో మొదటి బెంచీలో కూర్చున్న నాగరాజు అనే విద్యార్థి హటాత్తుగా బెంచీ క్రింద నుండి ఆమె కాళ్ళకు తన కాళ్ళు అడ్డం పెట్టాడు!

అంతే!

ఆ అమ్మాయి టేబిల్ దగ్గర నిల్చున్న నా మీద పడిపోయింది. ఆమె కింద పడిపోకుండా ఆమెను నేను గట్టిగా పట్టుకోక తప్పింది కాదు! ఆ వూపులో ఇద్దరం ఒకరి మీద ఒకరుగా కింద పడిపోయాం!

క్లాసంతా ఈలలతో, కేకలతో మారుమ్రోగి పోయింది!

నాలో సహనం చచ్చిపోయింది!

కోపం తారాస్థాయికి చేరుకుంది!

కళ్ళు నిప్పు కణాల్లా మారాయి!


లేచి నాగరాజు కాలరు పట్టుకుని నా కసితీర్చు కొట్టాను! నాలో వేడి చల్లారి నంతవరకూ ఎడా, పెడా కొడుతూనే ఉన్నాను!

విద్యార్థులంతా ఈ హటాత్సంఘటనతో నంభ్ర మాశ్చర్యాల్లో మునిగిపోయి చూడటం ప్రారంభించారు. క్లాసులో ఇంక ఉండలేక పోయాను. క్లాసు వదిలేసి తిన్నగా ప్రిన్సిపాల్ దగ్గరికి వెళ్ళి వివరంగా చెప్పాను.

"మీరు మరీ అంత 'ఎమోషనల్‌గా' అతన్ని కొట్టకుండా ఉండాల్సింది. ఇప్పుడు వాళ్ళు స్ట్రైకు చేస్తే ఏమీ చేసే దేమీ ఉండదు" అన్నాడు ప్రిన్సిపాల్ నిస్సహాయంగా!

మేం అనుకున్నట్టుగానే మరో అర గంటలోనే ఈ వార్త కాలేజి అంతా పాకిపోయింది. 'స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంటు' విద్యార్థులు మీద విద్యార్థు లందరినీ సమావేశ పరచి స్ట్రైకు నోటీసు జారీ చేశాడు.

"విద్యార్థులపై అత్యాచారాలు అరికట్టాలి."



శేఖ  చిత్రం :— ఎస్. గంగాధర్

"లెక్చరర్ల దురాగతాలు నశించాలి."

"మాకు అపాలజీ కావాలి."

ఇలాంటి కేకలతో కాలేజీ కేంపస్ ప్రతిధ్వనించి పోయింది!

వెంటనే ప్రిన్సిపాల్ స్టాఫ్ మీటింగు పెట్టాడు! ఆ మీటింగులో కొందరు 'ఆర్ట్సు లెక్చరర్స్' నన్ను సమర్థించారు. అపాలజీ ఇవ్వడం అనవసరమనీ ఇప్పుడు అలా చేస్తే రేపటికీ, మాపటికీ, అపాలజీ అడుగుతారనీ, 'టీచర్స్ ఇమేజ్ దెబ్బ తింటుం'దనీ వాదించారు. కాని నేనంటే పడని సైన్సు లెక్చరర్స్ మాత్రం 'ఒక విద్యార్థిని కొట్టడం దారుణం' అనీ, అతనికి అపాలజీ ఇవ్వక తప్పదనీ వాదించారు. నాకు అపాలజీ ఇవ్వడానికి అభిమానం అడ్డొచ్చింది. మీటింగయిన వెంటనే ప్రిన్సిపాల్ దగ్గరికి వెళ్ళి నా 'రిజిగ్నేషన్ పేపర్' ఇచ్చాను.

"ఏమిటిది? బాగా ఆలోచించే నిర్ణయం తీసు కున్నారా?" అడిగాడు ప్రిన్సిపాల్.

"యస్. సర్! అన్నీ ఆలోచించే చేస్తున్నాను. ప్లీజ్ యాక్సెప్టిట్" అన్నాను.

మనస్ఫూర్తిగా అది అందుకున్నాడు ప్రిన్సిపాల్. కనీసం ఒక్క స్టాపు మెంబరికీ చెప్పకుండా బయట కొచ్చేసి ఇంటికెళ్ళి అదే రోజు మెయిల్‌లో మా వూ రెళ్ళిపోయాను. ఏ విద్యార్థిలోకం నన్ను క్లాసులో అవహేళన చేసిందో, అదే విద్యార్థి లోకంతో సలాములు పెట్టించుకోవాలని, జేజేలు కొట్టించు కోవాలనీ నిశ్చయించుకున్నాను. మరో మూడు నెల లాగి నార్త్ ఇండియన్ యూనివర్శిటీలో ఎం. ఎస్‌సి.కి అప్లై చేశాను. నాది బి. యస్‌సి లో 'బైజెడ్' గ్రూప్ కావడంతో వెంటనే బాటనీలో సీటొచ్చింది. రెండు సంవత్సరాల్లో అది పూర్తిచేసి ఫస్టుక్లాసులో పాసయ్యాను. ఆంధ్రా మెడికల్ కాలేజీలో బాటనీ లెక్చరర్ పోస్టు ఇంటర్వ్యూకి వెళ్ళి సెలెక్టు అయి ఉద్యోగంలో చేరాను. ఉద్యోగంలో చేరిన రెండు నెల లకే ఆ నాగరాజు ఈ రూపంలో నాకు తారసపడడం గమ్మత్తుగా ఉంది నాకు! ఆ నాడు నా క్లాసులో విర్రవీగి ప్రవర్తించిన నాగరాజు ఈ రోజు నా వల్ల హాని జరుగుతుందేమోనని గిల్టీగా ఫీలవుతున్నాడు. ఏమిటో ఈ విద్యార్థి మనస్తత్వం ...'

ఆ మర్నాడు కాలేజీకి మామూలుగా వెళ్ళాను. క్లాసులన్నీ అయిపోయిన తరవాత అలా ఆఫీసు రూం వేపు వెళ్ళాను. ఆ రోజే అడ్మిషన్సుకి ఆఖరి రోజు కావడంతో అక్కడ ఆఫీసులో అందరూ హడావుడిగా ఉన్నారు. ఆఫీసు సూపరింటెండెంటు దగ్గరికి వెళ్ళి "నాగరాజు అన్న స్టూడెంట్ జాయినయ్యాడా" అని అడిగాను.

అతను లిస్టు చూసి, "ఆ కుర్రవాడు జాయిన్ కాలేదండీ. అందుకే వెయిటింగ్ లిస్టులో మొదటి కేండిడేట్‌కి ఆ సీటు ఇచ్చాం" అన్నాడు.

షాక్ తగిలినట్లయింది నాకు. నిన్న అంతగా చెప్పినా ఫలితం శూన్యం అన్న మాట! "ఈ దేశంలో విద్యార్థి మనస్తత్వం మారి పోదు" అనుకుంటూ ఇంటి ముఖం పట్టాను! ★

## అంతరాలు

ఈ బ్రతుకులో ఆనందంతోపాటూ
విషాదాన్ని కూడా విలికావా
ప్రభూ
నిషాదమే లేకుంటే
బ్రతుకు విలువ తెలియదనా
నీ అభిప్రాయం
ఎప్పుడూ విషాద సంగీతాన్నే
ఆలాపించమని కొందరిని శపించావా
ఆనంద తరంగాలలోనే ఓలలాడమని
మరి కొందరిని ఆశీర్వదించావా ప్రభూ!

నీ మాయా లీలలు అర్థంకావు
నీ తమాషా అంతుచిక్కదు
పేదవాడి కన్నీటి బొట్లను
ఘనీభవింప చేసి
ధనవంతుడి కీర్తి కిరీటాలను
నిలబెడుతున్నావా !
హృదయ మున్న మనిషికి మనస్తాపం
హృదయాలే లేని మరమనుషులకు
మహదానందం
ఏమి టీ విచిత్రం
ఎవరికీ అంతుబట్టదు నీ సృష్టిరహస్యం.

— టి. మురళీధరగౌడు